మెగా జాబ్‌మేళా విజయవంతం

పెదగంట్యాడ: యువతకు ఉపాధి కల్పించేందుకు పది ఎంఎన్‌సీ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ప్రైవేటు సెక్టార్‌లలో కూడా మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగులు ఇటువంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్వ్యూలను ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాకు సుమారు 1500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఫైజర్, కాన్సెంటిస్, యోకోహమా టైర్స్, డెక్కన్ కెమికల్, అపోలో ఫార్మసీ, జయభేరి ఆటోమేటివ్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్, గ్లోబల్ బయో మెడికల్ ఇండియా, బిగ్ బాస్కెట్, ఏసీటీ ఫైబర్ నెట్‌వర్క్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీలకు అవసరమైన వారిని ఎంపిక చేశారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.30వేల వరకూ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు, సీడ్యాప్ జేడీ ఎం కల్యాణి, స్కిల్ డెవలప్‌మెంట్ అసోసియేట్ మేనేజర్ ఎం.కొండలరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రమేష్‌నాయుడు, గాజువాక సబ్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ జేఈవో పీఎం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



ఇంటర్వ్యూలు చేస్తున్న జయభేరి ఆటోమేటివ్ ప్రతినిధులు

నాడు పాఠశాల భవనం.. నేడు టెంట్ హౌస్

- ఓ వ్యాపారి పాగా
- విస్తుపోతున్న జనం



భవనం లోపల ఉంచిన టెంట్‌హౌస్ సామగ్రి



యాతపాలెంలోని ఎంపీపీ పాఠశాల భవనం

పెదగంట్యాడ: అది జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యాతపాలెం.. అక్కడ ఎంపీపీ పాఠశాల ఉంది.. అదికాస్తా శిథిలావస్థకు చేరుకుంది.. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి.. అంతేకాకుండా ఆ భవనం చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి.. దీంతో అక్కడ తిష్ట వేసిన విష పురుగులు కాస్తా.. అప్పుడప్పుడు పాఠశాల ఆవరణలోకి వస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొని ఉండేది. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో వారందరినీ దిబ్బపాలెంలోని బడికి తరలించారు. ఆ బడి భవనం ఖాళీ కావడంతో అదే ప్రాంతానికి చెందిన ఓ టెంట్ హౌస్ వ్యాపారి అందులో పాగా వేశాడు. రెంట్ లేకుండానే టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. అందులో ఆయన వద్ద ఉన్న టెంట్‌హౌస్ సామగ్రి, లైటింగ్, మైక్ సెట్టింగ్‌కు చెందిన వస్తువులను దర్జాగా భద్రపరుస్తున్నాడు. ఈ వ్యవహారం చూసిన స్థానికులు అవాక్కవుతున్నారు. పిల్లల కోసం కట్టించిన బడి భవనాన్ని తన వ్యాపారానికి వాడుకుంటున్నాడంటూ విస్తుపోతున్నారు. కొద్దిపాటి మరమ్మతులు చేసుంటే బడి బాగుపడేదని, విషపురుగులు రాకుండా చుట్టూ ఉన్న తుప్పలను తొలగించేసి.. ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. దిబ్బపాలెం ఇక్కడికి దూరంగా ఉండడంతో తమ పిల్లలు రోజూ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ అంగన్వాడీ భవనాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, దానిని కూడా ఇందులోకి మార్చాలని చెబుతున్నారు. సచివాలయాలు కూడా అద్దె పంచన ఉన్నాయని, ఈ భవనాన్ని బాగు చేస్తే ప్రభుత్వానికి అద్దె మిగులుతుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవనాన్ని పరిశీలించి, అందులో తిష్ట వేసిన వ్యాపారిని బయటకు పంపించి, ఆ భవనానికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. ఉదయం 9.30 నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



రమణమ్మ (ఫైల్)

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు మృతి చెందింది.కుటుంబ సభ్యులు,స్థానికులు తెలిపిన వివరాలు.. ఆరిపాకకు చెందిన కొప్పాక రమణమ్మలు(65) శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి ఎదురుగా ఉన్న దుకాణానికి అవసరమైన నిత్యావసర వస్తువులు తెచ్చుకునేందుకు వెళ్తుంది. అదే సమయంలో చోడవరం నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీనితో రమణమ్మలు తల,ముఖానికి బలమైన గాయాలు కావడంతో సబ్బవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.అధిక రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మృతిచెందారు.మృతురాలి పెద్ద కుమారుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



అరవింద్ స్వామి సెంథిల్ కుమార్(ఫైల్)

సింహాచలం: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెందుర్తిలో చోటు చేసుకుంది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు..పెందుర్తిలోని తమిళనాడు మార్కెట్‌లో పనిచేస్తున్న అరవింద్ స్వామి సెంథిల్‌కుమార్(26) తల్లి మదమ్మ సెంథిల్‌కుమార్‌తో కలిసి పెందుర్తిలో నివసిస్తున్నాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఎక్కువగా ఉంది. ఈతరుణంలోనే ఈనెల 2వతేదీన తల్లితో గొడవపడి ఇంట్లో తనగదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. మూడోతేదీ మధ్యాహ్నం వరకు బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చితలుపులు బద్దలు కొట్టిచూడగా ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు మృతిచెందినట్టు ధృవీకరించారు. తల్లి మదమ్మ సెంథిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన గాత్ర కచేరీ

సీతంపేట: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్టల కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో డాక్టర్ కె.వందన చేసిన గాత్ర సంగీత కచేరీ ఆహుతులను అలరించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర సంగీత కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న వందన తన అద్భుత గాత్రంతో వీనుల విందు చేశారు. నన్ను విడిచి కదలకురా అనే రీతి గౌళ రాగకృతి, నే పొగడకుంటే అనే శుభపంతురావళి రాగకృతి, స్వరరాగసుధ అనే శంకరాభరణ రాగకృతి కీర్తనలు ఆలపించారు. వీరికి మంథా శ్రీరమ్య వయోలిన్‌పై, పి.ఎస్.ఫల్గుణ మృదంగంపై వాద్య సహకారం అందించారు. పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు వంకాయల వేంకట రమణమూర్తి బహుమతుల ప్రదానం చేశారు.

ఉక్కు ఉద్యమానికి కేంద్రం తలవంచాల్సిందే

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమ సెగకు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని, కార్మిక శక్తికి ప్రపంచదేశాలే తలవంచాయనే నిజాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం గ్రహించలేకపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. 723వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, పోరాట కమిటీనాయకులు అదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఏపీ స్టీల్ సెక్రటరీ పడాలి రమణ మాట్లాడుతూ ఒక వైపు ఉక్కు ఉత్పత్తిని పరుగులు పెట్టిస్తూనే కర్మాగారాన్ని రక్షించుకునేందుకు కార్మికులు దీక్ష చేయడం గొప్ప విషయమన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై తమకున్న పట్టుదల, ఉక్కు కార్మికుల ఐక్యతను చాటే విధంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తున్నామని, కార్మిక వర్గ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టిన గతే బీజేపీ ప్రభుత్వానికి పడుతుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

ఏఐటీయూసీ అధ్యక్షుడిపై ఫిర్యాదు



అమర్‌జిత్ కౌర్‌కు లేఖ అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావుపై జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్‌కు సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. శనివారం విశాఖ పర్యటనకు వచ్చిన కౌర్‌ను నాయకులు కలిసి ఈ మేరకు ఫిర్యాదు పత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కష్టపడిన నాయకులను, నిర్వాసిత ఉద్యోగులను, పార్టీ సభ్యులను కాదని కుల ప్రాతిపదికన నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తున్నారన్నారు. ఇష్టానుసారగా వ్యవహరించి యూనియన్ ప్రతిష్ట దెబ్బతీస్తున్నారన్నారు. ఏఐటీయూసీకి అనుబంధమైన సీపీఐ నాయకులను పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. ఈ అంశాలను యూనియన్ అధిష్టానానికి ఫిర్యాదు చేసినా వారు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. యూనియన్ అంశాలపై తగిన చర్య తీసుకోవాలని వారు కోరారు. అమరజిత్ కౌర్‌ను కలిసిన వారిలో సీపీఐ నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు, యంపాడ గోవిందరెడ్డి, మారినాయుడు, రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

అనుమానిత ఆర్ కార్డులపై చర్యలు తీసుకోవాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను మేజర్ సన్స్‌కు కేటాయించాలని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం కన్వీనర్ గొందేశి సత్యారావు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహనరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యారావు మాట్లాడుతూ ఒకే ఆర్ కార్డు నంబర్ ప్లాట్ మీద ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములు ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో ఆయా కుటుంబాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనుమానిత ఆర్ కార్డులను త్వరితగతిన క్లియర్ చేయాలని కోరారు. ఆర్ కార్డు నంబర్, ప్లాట్ నంబర్, ఎవరెవరికి కేటాయించారో తెలియజేసే ఆక్యుపేషన్ డేటాబేస్‌ను తయారు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎస్‌డీసీ ఈ సమస్యలపై వెంటనే దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దల్లిపైడికొండ, నీలాపు అప్పారావు, గొందేశి అప్పలరెడ్డి, పాల శ్రీను, కోన రమణ పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గొందేశి సత్యారావు

ఉక్కు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలి

ఉక్కునగరం: ఉక్కు కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం అమలు చేయాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప డిమాండ్ చేశారు. శనివారం ఈ అంశంపై ఉక్కు అడ్మిన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయిల్‌లో వేతన ఒప్పందం అమలు జరిగిన 15 నెలలు పూర్తయినా ఇక్కడ చేయకపోవడం అన్యాయమన్నారు. నూతన వేతనాలు కోసం యువ కార్మికులు ఎదురు చూస్తున్నారని, నూతన వేతనాల జాప్యం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా రిటైర్ అవుతున్న ఉద్యోగులు పెరుగుతున్నా నూతన నియామకాలు చేయకపోవడం వల్ల సిబ్బంది కొరత ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత గుర్తింపు సంఘం చేతకాని తనం వల్ల యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. కార్యక్రంలో కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, మార్టుపూడి పరదేశి, ఎం. జగ్గారావు, పిట్టారెడ్డి, డి. పుల్లారావు, కె. జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ శ్రేణులు

నేడు ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



నూకాంబిక అమ్మవారు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దల్లివానిపాలెం ఆర్.హెచ్.కాలనీలో సచివాలయం పక్కన నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పౌర్ణమి స్నానాలకు విస్తృత ఏర్పాట్లు



మహిళా భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక గదులు



జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు అందిస్తున్న సీఐ ఈశ్వరరావు



గ్రామ ప్రధాన కూడలి నుంచి తీరం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ తోరణాలు

పరవాడ: మాఘపౌర్ణమి తీర్థమహోత్సవానికి ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం ముస్తాబైంది. తీరంలో పుణ్యస్నానాలు ఆచరించడానికి ఆదివారం రానున్న వేలాది భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశారు. తీరం సమీపాన కొలువైన మాధవస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామ ప్రధాన కూడలి నుంచి తీరం వరకు విద్యుత్ తోరణాలు ఏర్పాటు చేశారు. తీరంలో జాగరణ చేసిన భక్తుల కోసం శనివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వచ్చే భక్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. తాగునీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయడానికి వీలుగా ప్రత్యేక స్టాల్స్ వేశారు. సముద్ర స్నానాలు ఆచరించే భక్తులకు సూచనలు అందజేయడానికి వీలుగా తీరంలో పోలీస్ పికెట్, గజ ఈతగాళ్లను నియమించారు. భక్తులకు అసౌకర్యాం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరవాడ సీఐ పి.ఈశ్వరరావు శనివారం రాత్రి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ

అల్లిపురం: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌సీసీ యూనిట్, కమ్యూనిటీ రూరల్ మెడికల్ ప్రాక్టీసనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులు మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది.. మానుకో మానుకో వ్యసనాల మానుకో అంటూ నినాదాలు చేస్తూ డాబాగార్డెన్స్, గొల్లలపాలెం ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుగుణేశ్వరి, ఆకుల రవికుమార్, బృందా హాస్పిటల్స్ మేనేజర్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, విద్యార్థినులు, సిబ్బంది

ఈపీఎస్ హయ్యర్ పెన్షన్‌పై తప్పుడు ప్రచారం

ఉక్కునగరం: ఈపీఎస్–95పై ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్నది తప్పుడు ప్రచారమని స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ మాజీ ట్రస్టీలు మంత్రి గోపి నారాయణ, పి.వి. రమణమూర్తి తెలిపారు. 2014 సెప్టెంబర్ 1 నాటికి సర్వీసులో ఉన్నవారు, రిటైర్మెంట్ ఎంప్లాయిస్ కూడా అర్హులని, వాళ్లందరూ కూడా హయ్యర్ పెన్షన్ కోసం సర్వీసులో ఉన్న వారు ఈనెల 20లో దరఖాస్తు చేసుకోవాలన్న ప్రకటన నిజం కాదని వారు పేర్కొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి శ్రీకారం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. శనివారం గ్రామంలోని శ్మశానవాటికలో సచివాలయం వీఆర్‌ఓ ప్రవీణ్, సర్వేయర్ రామారావులు సర్వే నిర్వహించారు. 1.92 ఎకరాలు గ్రామానికి శ్మశానవాటిక స్థలంగా ఉంది. సర్వే నిర్వహించి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పొందుపర్చనున్నట్లు సిబ్బంది తెలిపారు. కాగా శ్మశానవాటికలో ప్రధానమైన ప్రాంతాల్లో పనులను మాత్రం ప్రారంభిస్తున్నట్లు వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ తెలిపారు. అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంద్రాన నూకరాజు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికలో సర్వే రికార్డులను పరిశీలిస్తున్న సచివాలయ రెవెన్యూ సిబ్బంది

ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవాలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని వెంకటాద్రిపై వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి తిరువీధి ఉత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు మాట్లాడుతూ స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి రోజూ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలు ఆదివారంతో ముగియన్నాయని, పెద్ద సంఖ్యలోభక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చైతన్య మహిళా కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక చైతన్య మహిళా కళాశాలకు ఐఎస్‌వో 9001 – 2015 గుర్తింపు లభించిందని కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రసాద్ రెడ్డి చేతులు మీదుగా కళాశాలకు పలు అంశాల్లో లభించిన ఐఎస్‌ఓ గుర్తింపు సర్టిఫికెట్‌ను అందుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాజువాకలో 26 ఏళ్లగా మహిళల విద్యాసాధికారతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న చైతన్య మహిళా కళాశాలకు హెచ్‌వైఎం ఇంటర్నెషనల్ సర్టిఫికేషన్ సంస్థవారి ఐఎస్‌ఓ గుర్తింపు లభించిందన్నారు. అత్యుత్తమ బోధన, నాణ్యమైన విద్య అందిస్తున్నందుకు తమ ఈ గౌరవం దక్కిందన్నారు. పవర్ సేవింగ్, ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణ ద్వారా విద్యార్థులందరికి మంచి నీటి సదుపాయం, ఉన్నతమైన ప్రయోగశాల నిర్వహణ, సెమినార్‌లు నిర్వహించడానికి ఆధునిక టెక్నాలజీ వంటి వాటికి ఐఎస్‌వో 50001 – 2015 గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి నుంచి ఐఎస్‌వో సర్టిఫికెట్లను అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు


ఉక్కు ఉద్యోగికి ఎక్సలెన్స్ అవార్డు

పెదగంట్యాడ: ఈ నెల 2,3 తేదీల్లో న్యూఢిల్లీలోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్‌లో నార్తర్న్ ఇండియా చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రియేటివిటీ ఇన్నోవేషన్ ఆఫ్ ఎంప్లాయీస్ ఫర్ ఆర్గనేజేషన్ బిజినెస్ సక్సెస్ సదస్సులో ఉక్కు ఉద్యోగికి ఎక్సలెన్స్ అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో అన్ని రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ సీసీడ్ ఎలక్ట్రికల్స్ డిపార్టుమెంట్ సీనియర్ టెక్నీషియన్, నడుపూరుకు చెందిన యలమంచిలి అప్పలరాజు హాజరయ్యారు. మోడిఫికేషన్ ఆఫ్ మెయిన్ హోస్ట్ బ్రేక్ ప్యానెల్ ఇన్ కాస్టింగ్ క్రేన్స్ ఇన్ సీసీడ్ అనే అంశంలో తనదైన శైలిలో ప్రసంగించి ఆకట్టుకున్నారు. తన వాగ్ధాటితో అందరినీ ఆశ్చర్యపరిచారు. అనంతరం ఇస్కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ పాండే చేతుల మీదుగా ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ ఘనత సాధించిన అప్పలరాజును స్టీల్‌ప్లాంట్ అధికారులు, సహచర ఉద్యోగులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న యలమంచిలి అప్పలరాజు

ఎన్‌ఐపీఎంతో హెచ్‌ఆర్ ప్రావీణ్యం



కాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్‌ఐపీఎం కార్యదర్శి శేషగిరిరావు

ఉక్కునగరం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం) వంటి నైపుణ్య సంస్థలవల్ల మానవ వనరులు (హెచ్‌ఆర్)లపై మంచి ప్రావీణ్యత లభిస్తుందని ఎన్‌ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ బి.శేషగిరిరావు అన్నారు. ఎన్‌ఐపీఎం, విశాఖ స్టీల్‌ప్లాంట్ సంయుక్త ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీలో శనివారం 'లీగల్ ఆస్పెక్ట్స్ ఆన్ డిసిప్లెనైరీ ప్రొసీడింగ్స్ అండ్ హెచ్‌ఆర్ ప్రాక్టీసెస్' అనే అంశంపై కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఐపీఎం వంటి సంస్థల వల్ల మానవ వనరుల వినియోగం, వాటి వల్ల లోపాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాలపై పరిజ్ఞానం కలుగుతుందన్నారు. ముఖ్య అతిథి, స్టీల్‌ప్లాంట్ సీజీఎం కె. శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్ (పర్సనల్) వై.ఆర్. రెడ్డిలు మానవ వనరుల సంబంధాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ, హెచ్‌పీసీఎల్, బ్రాండెక్స్, స్టీల్‌ప్లాంట్, గీతం, ఏయూ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల పునర్వివాహ పరిచయ వేదిక

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా ఆర్యవైశ్య సంఘం, పాతనగరం వుడ్‌యార్డ్ స్ట్రీట్‌లోని వాసవీ కల్యాణ మండప సంఘాల ఆధ్వర్యంలో శనివారం పునర్వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. పెళ్లి సంబంధాలు కుదరక తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, భర్త లేక భార్య చనిపోయినా లేదా విడాకులు తీసుకుని విడిపోయినా, జీవిత చరమాంకంలో ఒకరికి ఒకరు తోడు అవసరం ఉంటుందనే నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తమ్మన అమర్‌నాథ్, వాసవీ కల్యాణ మండప సంఘ అధ్యక్షుడు విన్నకోట రామ్మూర్తి తెలిపారు. విశాఖతో పాటు వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారని కార్యక్రమ చైర్మన్ ఐఆర్‌కే ప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ఆలస్య, పునర్వివాహ పరిచయ వేదికకు సంబంధించిన బుక్లెట్‌ను ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, కందుల మూర్తి, వేదమధుసూదన్, జగన్నాథరావు పాల్గొన్నారు.